

# అర్జున్, హారికకు నజరానా

**25 లక్షలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో పసిడి పతకాలతో కొత్త చరిత్ర లిఖించిన తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేసి అర్జున్, ద్రోణవల్లి హారిక ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసిన అర్జున్, హారికకు ప్రభుత్వం రూ.25లక్షల చొప్పున నగదు ప్రోత్సాహం ప్రకటించింది. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి..అర్జున్‌తో పాటు హారికను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్జున్, హారిక కుటుంబసభ్యులతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెమీస్‌కు త్రిసా, గాయత్రి జోడీ

మకావు (చైనా): భారత స్టార్ షట్లర్ ద్వయం పుల్లెల గాయత్రి, త్రిసా జాలీ జోడీ మకావు ఓపెన్ సూపర్– 300 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో 23వ ర్యాంకు భారత జోడీ.. 21–12, 21–17తో ఆరో సీడ్ చైనీస్ తైపీ అమ్మాయిలు హ్సు యిన్–హుయ్, లాన్ జి యున్‌ను చిత్తు చేసింది. ఆట ఆరంభం నుంచే ఆధిక్యంలో నిలిచిన భారత జంట.. వరుస సెట్లలో ప్రత్యర్థిని ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. నాలుగు నెలల విరామం తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన కిడాంబి శ్రీకాంత్ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 16–21, 12–21తో కా లంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో నిష్క్రమించాడు.

# లంక 602/5 డిక్లేర్డ్

**కమిందు మెండిస్ రికార్డు శతకం**



కమిందు (182*)

గాలె: శ్రీలంక బ్యాటర్లు శతకాల పండుగ చేసుకోవడంతో న్యూజిలాండ్‌తో గాలె వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఆ జట్టు భారీ స్కోరు చేసింది. ఆట రెండో రోజు కమిందు మెండిస్ (250 బంతుల్లో182 నాటౌట్, 16 ఫోర్లు, 4 సిక్సర్లు), కుశాల్ మెండిస్ (149 బంతుల్లో 106 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) శతకాలతో కదం తొక్కగా ఏంజెలో మాథ్యూస్ (88) తృటిలో సెంచరీ కోల్పోయాడు. ఆట తొలి రోజు చండీమాల్ (116) శతకంతో రెచ్చిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆ జట్టు 602/5 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 22 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది.

**డాన్ సరసన మెండిస్:**

ఈ టెస్టులో వంద పరుగులు చేయడంతో మెండిస్ పలు రికార్డులు నెలకొల్పాడు. టెస్టులలో అతి తక్కువ (13) ఇన్నింగ్స్‌లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన వారిలో మెండిస్ నాలుగో స్థానంలో (హెర్బర్ట్ సట్‌క్లిఫ్–12, ఎవర్టన్ వీక్స్–12, డాన్ బ్రాడ్‌మన్–13 ముందున్నారు) నిలిచాడు. మ్యాచ్‌ల పరంగా మెండిస్ –8 (బ్రాడ్‌మన్ 7 మ్యాచ్‌లు) రెండో స్థానంలో ఉన్నాడు. అంతేగాక టెస్టులలో అతడికి ఇది ఐదో శతకం కావడం గమనార్హం. 13 టెస్టు ఇన్నింగ్స్ తర్వాత ఐదు సెంచరీలు చేసిన వారిలో మెండిస్ ఆరో స్థానంలో నిలిచాడు.

**కాన్పూర్ టెస్టుకు వర్షం అడ్డంకి**

# వరుణుడి ఆట

**తొలి రోజు 35 ఓవర్లే సాగిన మ్యాచ్ ● ముగ్గురు సీమర్లతో బరిలోకి భారత్ ● రాణించిన ఆకాశ్ దీప్**

**భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వరుణుడు ఆటంకంగా మారాడు. మ్యాచ్ గెలిచి సిరీస్ క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న టీమ్‌ఇండియా ఆశలపై నీళ్లు చల్లేలా కనిపిస్తున్నాడు. వర్షంతో గంటన్నర ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ మూడు వికెట్లు చేజార్చుకుని 107 పరుగులు చేసింది. యువ పేసర్ ఆకాశ్‌దీప్ ధాటికి బంగ్లా బ్యాటర్లు తేలిపోయారు. వరుస విరామాల్లో వర్షం ఎడతెరిపి లేకుండా కురువడంతో మైదానం చిత్తడిగా మారింది. దీంతో మొదటి రోజు ఆట 35 ఓవర్లకే పరిమితమైంది.**



ఆకాశ్‌దీప్ (2/34)

కాన్పూర్: సొంతగడ్డపై బంగ్లాదేశ్‌ను రెండో టెస్టులోనూ ఆదిలోనే దెబ్బకొట్టి ఆధిపత్యం చెలాయించాలని చూసిన భారత క్రికెట్ జట్టు ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియం వేదికగా శుక్రవారం మొదలైన రెండో టెస్టుకు వరుణుడు పదే పదే అంతరాయం కల్పించాడు. వెలుతురు లేకపోవడం, వర్షం కారణంగా తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న బంగ్లాదేశ్.. 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మోమినుల్ హక్ (40 బ్యాటింగ్, 7 ఫోర్లు), ముష్ఫీకర్ రహీమ్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్ (2/34) రాణించాడు.

**గంటన్నర ఆలస్యంగా..**

కాన్పూర్‌లో గురువారం రాత్రి వర్షం కురవడంతో గ్రీన్ పార్క్ మైదానం ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారింది. దీంతో మ్యాచ్ నిర్ణీత సమయాని కంటే గంట (ఉదయం 10:30 గంటలకు) ఆలస్యంగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన రోహిత్.. ఆశ్చర్యకరంగా ఫీల్డింగ్ (స్వదేశంలో టెస్టు ఆడుతూ టాస్ గెలిచి భారత్ ఫీల్డింగ్ చేయడం 2015 తర్వాత ఇదే మొదటిసారి) ఎంచుకోవడంతో పాటు ముగ్గురు సీమర్లతో బరిలోకి దిగింది. కాన్పూర్ పిచ్ మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని భావించినా రోహిత్ మాత్రం తొలి టెస్టులో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాడు. ఆట ఆరంభమయ్యాక బుమ్రా, సిరాజ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు బంగ్లా ఆచితూచి ఆడింది. ఓపెనర్లు షద్మాన్ ఇస్లాం (24), జకీర్ హసన్ (0) డిఫెన్స్‌కే ప్రాధాన్యమిచ్చారు. జకీర్ అయితే వికెట్ కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డాడు.

**బ్రేక్ ఇచ్చిన ఆకాశ్..**

బంగ్లా ఇన్నింగ్స్ 9వ ఓవర్‌లో బంతిని ఆకాశ్‌దీప్‌కు అందించిన రోహిత్ నమ్మకాన్ని అతడు వమ్ము చేయలేదు. తన తొలి ఓవర్ మూడో బంతికే అతడు.. జకీర్‌ను పెవిలియన్‌కు పంపి భారత్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. జకీర్ ఇచ్చిన క్యాచ్‌ను గల్లీలో జైస్వాల్ ముందుకు డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. తన మూడో ఓవర్‌లో ఆకాశ్.. మరో ఓపెనర్ షద్మాన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా సారథి నజ్ముల్ హొసెన్ శాంతో (31, 6 ఫోర్లు) ఆరంభంలో రెండు ఫోర్లు కొట్టి తన ఉద్దేశాన్ని చాటాడు. లంచ్ సమయానికి ఆ జట్టు స్కోరు 74/2గా ఉంది. ఆటగాళ్లు లంచ్‌కు వెళ్తున్న సమయంలోనే వర్షం రావడంతో రెండో సెషన్ 20 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. వర్షం తగ్గాక బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లా.. లంచ్ తర్వాత మూడో ఓవర్లో శాంతో వికెట్‌ను కోల్పోయింది. క్రీజులో కుదురుకుంటున్న శాంతోను అశ్విన్ వికెట్ల ముందు బలిగొన్నాడు.

**మళ్లీ వర్షం..**

శాంతో నిష్క్రమించిన తర్వాత ఐదు ఓవర్లకు వెలుతురు సరిగ్గా లేకపోవడంతో అంపైర్లు కొద్దిసేపు ఆటను నిలిపేశారు. అదే సమయంలో మొదలైన వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో తొలి రోజు ఆటను నిలిపేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

**2** శాంతోను ఔట్ చేయడం ద్వారా ఆసియాలో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ (420)గా అశ్విన్ నిలిచాడు. ఈ క్రమంలో అతడు కుంబ్లే (419)ను దాటేశాడు. మురళీధరన్ (612) అగ్రస్థానంలో ఉన్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 107/3 (మోమినుల్ 40 నాటౌట్, శాంతో 31, ఆకాశ్ 2/34)

## ఆస్పత్రి పాలైన బంగ్లా 'సూపర్ ఫ్యాన్'



బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తూ ఒళ్లంతా పులిచారలు, చేతిలో ఆ దేశ జెండాను పట్టుకుని కనబడే సూపర్ ఫ్యాన్ 'టైగర్ రాబీ' శుక్రవారం దవాఖాన పాలయ్యాడు. రెండో టెస్టు సందర్భంగా స్టాండ్ 'సీ'లో ఉన్న అతడు ఉన్నట్టుండి అస్వస్థతకు గురవడంతో అక్కడే ఉన్న పోలీసులు వెంటనే రాబీని స్థానిక ఆస్పత్రికి తరలించారు. 'మ్యాచ్ జరుగుతుండగా అతడు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించాం. ప్రస్తుతం అతడి పరిస్థితి మెరుగ్గా ఉంది' అని కాన్పూర్ అడిషనల్ కమిషనర్ హరీష్ చందర్ తెలిపారు. కానీ అంతకుముందు రాబీ అతడిపై ఎవరో దాడి చేశారని.. తన వీపుతో పాటు పక్కటెముకల మీద ఎవరో బలంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయానని చెప్పడం గమనార్హం.

## కోహ్లీ కోసం 58 కి.మీలు

భారత్‌లో క్రికెట్‌కు క్రేజ్ మామూలుగా ఉండదు. తమ ఆరాధ్య ప్లేయర్ల ఆటను ఒక్కసారైనా దగ్గర్నుంచి చూడాలని అనుకుంటారు. ఇప్పుడు ఇదే కోవలో ఉన్నావ్‌కు చెందిన 15 ఏండ్ల కార్తీకేయ్ అనే కుర్రాడు..కోహ్లీ ఆట చూసేందుకు ఏకంగా 58కి.మీలు సైకిల్ మీద మ్యాచ్ వేదికైన కాన్పూర్‌కు వచ్చాడు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న కార్తీకేయ్..తాను అభిమానించే కోహ్లీ కోసం ఇంత దూరం ఒంటరిగా వచ్చినట్లు మీడియాతో పేర్కొన్నాడు. కార్తీకేయకు క్రికెట్‌పై ఉన్న ఇష్టానికి అందరూ ఫిదా అవుతున్నారు.


## చాయ్‌వాలాతో సెల్ఫీలు.. మమ్మల్ని పట్టించుకోలే!

**● భారత హాకీ ప్లేయర్ హార్దిక్ ఆవేదన**




ఢిల్లీ: ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న హాకీ ప్లేయర్ హార్దిక్‌సింగ్ తమకు రావాల్సిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటర్నెట్ సంచలనం 'డాలీ చాయ్‌వాలా'కు ఉన్న గుర్తింపు సైతం తమకు లేదని, జాతీయ జట్టుకు ఏండ్లుగా ఆడుతున్నా అభిమానులు తమను కనీసం పట్టించుకోలేదని తెలిపాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో హార్దిక్ మాట్లాడుతూ.. 'నేను నా సొంత కళ్లతో చూసిన విషయాన్ని మీకు చెబుతున్నాను. పారిస్‌లో కాంస్య పతకం గెలిచి స్వదేశానికి తిరిగొచ్చిన మా బృందంలో నేను, హర్మన్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్‌సింగ్‌తో పాటు ఐదారుగురం ఒకేచోట ఉన్నాం. మాతో పాటు డాలీ చాయ్‌వాలా కూడా అక్కడే ఉన్నాడు. అక్కడికి వచ్చిన ప్రజలు అతడితో సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడుతున్నారు. కనీసం మమ్మల్ని పట్టించుకునే నాథుడే కనిపించలేదు. ఇది చూసి మాకు ఒకింత ఇబ్బందిగా అనిపించింది. ఒక అథ్లెట్‌కు పేరు, డబ్బు కంటే అభిమానుల నుంచి గుర్తింపు దక్కినప్పుడు ఆ ఆనందాన్ని మాటల్లో వ్యక్తపరచలేము. ఏ అవార్డూ దానికి సరితూగదు' అంటూ ఆవేదన చెందాడు.

## ఐటా అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానం!



ఢిల్లీ: భారత టెన్నిస్ సమాఖ్య (ఐటా) అధ్యక్షుడు అనిల్ జైన్‌పై 8 రాష్ట్రాల టెన్నిస్ అసోసియేషన్స్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించాయి. ఈ మేరకు శనివారం (సెప్టెంబర్ 28) ఎక్స్‌ట్రా ఆర్డినరీ జనరల్ మీటింగ్ (ఈజీఎం)ను నిర్వహించేందుకు ఈ రాష్ట్రాల టెన్నిస్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. అసోం, జమ్మూ కాశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, గుజరాత్, త్రిపుర రాష్ట్రాల ప్రతినిధులు అనిల్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. వాస్తవానికి శనివారం ఐటా కూడా వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) జరిపించాల్సి ఉండగా అనిల్ వ్యతిరేక వర్గం కూడా ఇదే రోజు ఈజీఎంకు పిలుపునివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఐటా నిధులను అనిల్ పక్కదారి మళ్లిస్తున్నారని, ఆయన తన కుటుంబంతో కలిసి విహారయాత్రలకూ ఈ నిధులనే వినియోగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

## కేకేఆర్ మెంటార్‌గా బ్రావో



కోల్‌కతా: వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్, దిగ్గజ ఆటగాడు డ్వేన్ బ్రావో త్వరలో కొత్త బాధ్యతలు నిర్వర్తించబోతున్నాడు. ఐపీఎల్ గత సీజన్ విజేత కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు అతడు వచ్చే ఎడిషన్ నుంచి మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు కేకేఆర్ ఈ విషయాన్ని శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. 2024 సీజన్‌లో కేకేఆర్‌కు గౌతం గంభీర్ మెంటార్‌గా వ్యవహరించగా బ్రావో.. చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ కోచ్‌గా పనిచేశాడు.

## ఆసీస్‌కు భారీ షాక్

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియాకు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ వెన్ను గాయం కారణంగా వన్డే సిరీస్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్నాడు. నాలుగో వన్డేకు ముందు నిర్వహించిన వైద్య పరీక్షలలో అతడి వెన్నుకు గాయమైనట్టు తేలడంతో గ్రీన్.. సిరీస్ నుంచి తప్పుకున్నాడు. గాయం తీవ్రత ఎక్కువైతే నవంబర్ నుంచి జరిగే భారత్, ఆసీస్ సిరీస్‌లో అతడు ఆడేది అనుమానమేనని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) వర్గాల సమాచారం.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.